శుక్ర వారం
5-1-2024
సంపుటి - 09,
సంచిక - 423
పేజీలు - 4
వెల రూ. 5/-
Telangana
Andhra P
CEO & Editor : G. PRUDHVIRAJ
RNI NO: TELTEL/2016/73311
www.samasamajam.in
సమ సమాజం
SAMA SAMAJAM TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

# ఖర్గే సమక్షంలో కండువా కప్పిన రాహుల్

## కాంగ్రెస్ అతిపెద్ద సెక్యులర్ పార్టీ అన్న షర్మిల

- పార్టీ ఆదేశిస్తే.. అండమాన్ వెళ్లమన్నా వెళతా
- తండ్రి వైఎస్ అడుగుజాడల్లో నడుస్తానని ప్రకటన
- రాహుల్‌ను ప్రధానిగా చూడాలన్నదే కోరిక



**న్యూఢిల్లీ, జనవరి 4 (సమ సమాజం):** ఎట్టకేలకు వైఎస్సార్టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. గురువారం ఉదయం ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీల సమక్షంలో షర్మిల కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. షర్మిల చేరికతో కాంగ్రెస్ పార్టీలో వైఎస్సార్టీపీ విలీనం అయ్యింది. ఈ కార్యక్రమంలో ఏపీ కాంగ్రెస్ ఇంచార్జ్ మాణిక్యం ఠాగూర్, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పీసీసీ ప్రెసిడెంట్ గిడుగు రుద్రరాజు, పలువురు నేతలు పాల్గొన్నారు. కాంగ్రెస్‌లో షర్మిల చేరికతో గత కొద్దిరోజులుగా వస్తున్న వార్తలకు తెరబడింది.కాంగ్రెస్ పార్టీలో చేరడం సంతోషంగా ఉందని, కాంగ్రెస్‌లో వైఎస్సార్టీపీని విలీనం చేశామని షర్మిల అన్నారు. కాంగ్రెపార్టీ

3వ పేజీలో...

# ఢిల్లీలో బిజీగా సిఎం రేవంత్ పర్యటన

### పలువురు కేంద్రమంత్రులతో భేటీ

రాష్ట్ర సమస్యలపై ప్రస్తావన



3వ పేజీలో...

# అద్దెబస్సుల యాజమానులతో చర్చలు సఫలం

- నేటినుంచి యధావిధిగా బస్సులు
- సమస్యల పరిష్కారానికి కమిటీ వేస్తాం
- ఆర్టీసీ ఎండి సజ్జన్నార్ వెల్లడి



**హైదరాబాద్, జనవరి 4 (సమ సమాజం):** అద్దె బస్సు ఓనర్లతో చర్చలు సఫలం అయ్యాయని టీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జ నార్ తెలిపారు. గురువారం బస్ భవన్‌లో అద్దె బస్సు ఓనర్లతో ముగిసిన సమావేశం అనంతరం ఆయన వివరాలను వెల్లడించారు. ఆర్టీసీ

3వ పేజీలో...

# కానిస్టేబుల్ ఎంపికలకు తొలగిన అడ్డంకి

సింగిల్ బెంచ్ తీర్పును కొట్టేసిన హైకోర్టు



**హైదరాబాద్, జనవరి 4 (సమ సమాజం):** కానిస్టేబుళ్ల నియామకంపై తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్ కీలక తీర్పు చెప్పింది. 15640 కానిస్టేబుళ్ల పోస్టులకు హైకోర్టులో అడ్డంకి తొలగింది. గతంలో సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును హైకోర్టు డివిజన్ బెంచ్ కొట్టేసింది.కానిస్టేబుళ్ల ప్రశ్నాపత్రంలో నాలుగు

3వ పేజీలో...

# అధికారం కోల్పోవడంతో ఉక్కిరిబిక్కిరి

- తప్పులు కప్పిపుచ్చుకునేందుకు నిందలు
- దళితముఖ్యమంత్రి, 3 ఎకరాల హామీలు ఏమయ్యాయి
- పదేళ్లపాటు తెలంగాణను అప్పులకుప్ప చేశారు
- అధికారంలోకి రాగానే రెండు హామీల అమలు
- ఫ్రీ బస్సుతో మహిళల్లో ఆనందం
- కాళేశ్వరంపై న్యాయవిచారణకు ఆదేశించాం
- బిఆర్ఎస్ నేతలే డబుల్ 420లు
- మీడియా సమావేశంలో మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క



3వ పేజీలో...

# కాళేశ్వరంలో బిజెపి వాటా నిరూపించాలి

- సిబిఐ విచారణ ఎందుకు కోరడం లేదు
- అభయహస్తం దరఖాస్తుల పేరుతో టైమ్‌పాస్
- రాహుల్‌కు ప్రధాని ఛాన్స్ లేదన్న కిషన్ రెడ్డి



**హైదరాబాద్, జనవరి 4 (సమ సమాజం):** కాళేశ్వరంలో బీజేపీకి వాటా ఉందని చేసిన ఆరోపణలపై మండిపడ్డ బిజెపి అధ్యక్షుడు కిషన్ రెడ్డి కాంగ్రెస్‌కు దమ్ముంటే నిరూపించాలన్నారు. లంకెబిందెలు కోసమే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారా? అని ప్రశ్నించారు. కాళేశ్వం అవినీతి విషయంలో కేసీఆర్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం రక్షిస్తోందని ఆరోపించారు. కేసీఆర్‌కు తాను కాదు.. కాంగ్రెస్ పార్టీనే బినామీ అని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ బిచాణా ఎత్తివేస్తదని.. బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే చెత్తబుట్టలో వేసినట్లే అని అన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం హోదాలో రేవంత్ రెడ్డి కాళేశ్వరంపై సీబీఐ విచారణ ఎందుకు కోరటం లేదని ప్రశ్నించారు. నిర్మాణాత్మకమైన సూచనలు చేస్తే.. కాంగ్రెస్ నేతలు అహంకారంతో తనపై వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారన్నారు. అప్లికేషన్ల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం టైమ్ పాస్ చేస్తోందని విమర్శించారు. అభయహస్తం పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న దరఖాస్తుల్లో ఏదో మతలబు ఉందని అనుమానం వ్యక్తం చేశారు. దరఖాస్తులతో ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నారు. గత

3వ పేజీలో...

# కెసిఆర్‌కు జగన్ పరామర్శ

### ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు రాక



**హైదరాబాద్, జనవరి 4 (సమ సమాజం):** బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్‌ను ఏపీ సీఎం వైఎస్ జగన్ గురువారం పరామర్శించారు. ప్రత్యేక విమానంలో తాడేపల్లి నుంచి బేగంపేట ఎయిర్ పోర్టుకు చేరుకున్న ఆయనకు మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం బంజారాహిల్స్ లోని

3వ పేజీలో...

# అసెంబ్లీ ఎన్నికల్లో సాయం కోసం జగన్ తంటాలు

### కెసిఆర్‌ను కలవడంలో మతలబు ఇదే : నారాయణ



**హైదరాబాద్, జనవరి 4 (సమ సమాజం):** ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో సాయం కోసమే జగన్, కేసీఆర్ దగ్గరకు వచ్చారని ఏపీ సీఎం జగన్, తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్‌ను కలవడం పై సీపీఐ నారాయణ కీలక వ్యాఖ్యలు చేశారు. ఓట్ల కోసమే జగన్, కేసీఆర్ దగ్గరకి పరామర్శకు వచ్చారని విమర్శించారు. కేసీఆర్‌ను అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించేందుకు ప్రయత్నించి జగన్ విఫలమ్యాయరని చెప్పారు. గురువారం నారాయణ మీడియాతో మాట్లాడుతూ పోలింగ్ రోజు నాగార్జునసాగర్‌లో లేని గొడవ సృష్టించి జగన్, కేసీఆర్‌కు లాభం చేకూర్చాలని ప్రయత్నించారని ఆరోపించారు. జగన్‌లో మెదటసారి ఓటమి భయం కన్పిస్తుందని.. అందుకే చంద్రబాబుపై ఆరోపణలు చేస్తున్నారని నారాయణ అన్నారు. ఇంట్లో కుంపటి వ్యాఖ్యలు చేసి.. జగన్ తన ఓటమిని ఒప్పుకున్నారని

3వ పేజీలో...

# బిసిల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

### వారికిచ్చే ఉచిత విద్యుత్ కొనసాగుతుంది

- ఇచ్చిన హామీల అమలకు కృషి చేయాలి
- అధికారులను ఆదేశించిన మంత్రి పొన్నం



**హైదరాబాద్, జనవరి 4 (సమ సమాజం):** రజక, నాయి బ్రాహ్మణల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సెలూన్, లాండ్రీ, ధోబీఘాట్‌లకి విద్యుత్ అధికారులు కనెక్షన్ కట్ చేయరని, ఎవరు అధైర్యపడవద్దని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వం 2021-22 ఆర్థిక సంవత్సరం నుంచి లాండ్రీలు, ధోబీ

3వ పేజీలో...

# నాడు కారు.. సారు..పదహారు

## ఇప్పుడేమో తెలంగాణ సెంటిమెంట్

### బిఆర్ఎస్‌ను ఆదరిస్తే ప్రజలకు వచ్చే లాభం

### రెండు జాతీయ పార్టీలను కాదని ఓటేస్తారా?

హైదరాబాద్, జనవరి 4 (సమ సమాజం): గత పార్లమెంట్ ఎన్నికల్లో 9మందిని గెలిపించారు. సారు..కారు..పదహారు అన్న నినాదంతో ముందుకు వెళ్లగా 9మందిని గెలిపించారు. బిజెపికి నలుగురిని, కాంగ్రెస్‌కు ముగ్గురిని, ఎంఐఎంకు ఒక్కరిని గెలిపించారు. 9మందితో గులాబీ బాస్ ఏం సాధించారు. మొక్కుబడిగా వినతిపత్రాలు ఇచ్చి మిన్నకున్నారు. కేంద్రాన్ని నిలదీసి ఒక్కటంటే ఒక్క పని చేయించలేదు. లోపాయకారి ములాఖాత్‌లు తప్ప ఒరిగిందేమీ లేదు. అలాంటి వారు మళ్లీ పార్లమెంటు ఎన్నికల్లో గెలిచి ఏం సాధిస్తారు. ప్రజలు వీరిని గెలిపించి..ఓటును దుర్వినియోగం చేసుకోవడం తప్ప చేసేదేమీ లేదు. తెలంగాణ బలం.. తెలంగాణ గళం.. తెలంగాణదళం పార్లమెంట్‌లో ఉండాలని అంటున్న కెటిఆర్.. గతాన్ని నెమరేసుకుంటే మంచిది. తెలంగాణ ప్రయోజనాల కోసం రాజీలేకుండా కొట్లాడాలంటే..తెలంగాణ ప్రయోజనాల కోసం పేగులు తెగేదాక అవసర మైతే నిలబడాలి.. కలబడాలంటే బీఆర్ఎస్‌కి మాత్రమే అని కేటీఆర్ చెప్పడం హాస్యాస్పదం. అంతగా బలం ఉండి చేసిందేమీ లేదు. సొంత పనులు చేసుకోవడం, అధికార దర్పం వెలగబెట్టడం తప్ప మరోటి ఉండదు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలవడానికి అనుసరించాల్సిన వ్యూహాలపై తెలంగాణ భవన్‌లో జరిగిన సమావేశంలో కెసిఆర్ సిఎంగా లేనందుకు ప్రజలు బాధపడుతున్నారని చెప్పారు. నిజానికి ప్రజల సంగతి పక్కన పెడితే కెటిఆర్ , ఆయన కుటుంబ సభ్యులు మాత్రం బాధపడుతూనే ఉంటారు. తెలంగాణ అన్న పదం తీసేసి భారత రాష్ట్ర సమితి అన్న పేరును పెట్టుకున్నప్పుడే వారికి పేగుబంధం తెగింది. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటు అడగాలనుకున్న కాన్సెప్ట్‌కు.. పార్టీ పేరుకు మ్యాచ్ కావడం లేదు. అసలు ఇలా అడగాల్సి వస్తుందని ఊహించి ఉంటే.. పార్టీ పేరు మార్చి ఉండేవారు కాదేమో.. ! అందుకే ఇప్పుడు మళ్లీ

పార్టీని టిఆర్ఎస్‌గా మార్చాలన్న డిమాండ్ కొందరు గులాబీనేతల్లో వ్యక్తం అవుతోంది. సెంటిమెంట్లను బలంగా నమ్మే గులాబీ నేతలు దీనిపై కసరత్తు చేస్తారా అన్నది చూడాలి. భారత రాష్ట్ర సమితికి ఇప్పుడు లోక్ సభ ఎన్నికలు డూ ఆర్ డై అనే పరిస్థితిని తీసుకు వచ్చాయి. ఓసారి ఓడిపోయిన వెంటనే ఎన్నికలు ఎదుర్కోవడం ఏ పార్టీకి అయినా కష్టమే. ఇప్పటికే పరాజయం ఎదురైనందున ఇప్పుడిప్పుడే కోలుకోవడం కష్టం. బీఆర్ఎస్ లాంటి ప్రాంతీయ పార్టీకి దాదాపుగా ఇది అసాధ్యం అని చెప్పాల్సిందే. అలాంటి పరిస్థితిని ఎదుర్కొని పార్టీని మళ్లీ విజయతీరాలకు చేర్చడానికి ఇప్పుడు కేసీఆర్, కేటీఆర్ సిద్ధమయ్యారు. అయితే ప్రజల్లో పూర్తిగా ప్రజాదరణ కోల్పోయాక మళ్లీ కల్లబొల్లి కబుర్లు చెబితే ప్రజలు నమ్మరు. లోక్‌సభ ఎన్నికల్లో వారి ముందున్న అసలు సవాల్.. బీఆర్ఎస్‌కు ఎందుకు ఓటేయాలో ప్రజలకు చెప్పడం. అసెంబ్లీకే వద్దనుకున్న ప్రజలు పార్లమెంట్‌కు బీఆర్ఎస్‌కు ఎందుకు ఓటేస్తారన్న సందేహం సహజంగానే వస్తోంది. ఎందుకంటే పార్లమెంట్‌కు ఎన్నికయి వీరు ఒరగబెట్టేదేమీ లేదు.అందుకే మళ్లీ సెంటిమెంట్ పాచికను ముందుకు తెస్తున్నారు. చివరికి తెలంగాణ బలం, తెలంగాణ గళం , తెలంగాణ దళం బీఆర్ఎస్ కాబట్టి ఓటేయాలన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ వాయిస్ బలంగా వినిపించాలంటే బీఆర్ఎస్‌కే ఓటేయాలని ప్రజలకు చెప్పాలనుకుంటున్నాట్లు యువరాజు ప్రకటించారు. తెలంగాణలో 2014లో జమిలీ ఎన్నికలు జరిగాయి. పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు ఒకే సారి జరిగాయి. 2018లో కేసీఆర్ ఆరు నెలలు ముందస్తుగా ఎన్నికలకు వెళ్లారు. అప్పుడు ఆయన ఆలోచన వేరే విధంగా ఉంది. పార్లమెంట్ ఎన్నికలు, అసెంబ్లీ ఎన్నికలు జమిలీగా జరిగితే జాతీయ అంశాల ప్రాతిపదికగా ఓటింగ్ జరుగుతుందని అదే జరిగితే తనకు నష్టం జరుగుతుందన్న ఉద్దేశంతో ఆయన ముందస్తుకు వెళ్లారు. అసెంబ్లీలో మంచి ఫలితం సాధించారు. రెండోసారి గెలిచిన ఊపులో పార్లమెంట్ ఎన్నికల్లోనూ స్వీప్ చేయవచ్చని అనుకున్నారు. సారు కారు పదహారు నినాదంతో ఎన్నికలకు వెళ్లారు. కానీ ప్రజలు లోక్ సభ ఎన్నికల్లో టీఆర్ఎస్‌కు ఓటు వేసేందుకు ఆసక్తి చూపించలేదు. నాలుగు సీట్లు బీజేపీకి, మూడు సీట్లు కాంగ్రెస్ కు ఇచ్చారు. ఒక సీటు మజ్లిస్ ఖాతాలో ఎలాగూ పడుతుంది. అంటే.. బీఆర్ఎస్ నెంబర్ 9 దగ్గరే ఆగిపోయింది. ఇప్పుడు మరోసారి లోక్ సభ ఎన్నికలను ఎదుర్కొనేందుకు సిద్ధమైంది. కానీ ఈసారి అధికారంలో లేదు. పరాజయాన్ని ఎదుర్కొని ప్రతిపక్ష పార్టీగా ఎన్నికలకు వెళు తుంది. ఓ వైపు ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు దూకుడుగా వెళ్తున్న కాంగ్రెస్ , మోదీ మానియా ఇంకా ఉందని హడావుడి చేస్తున్న బీజేపీలను తట్టుకోవడం బీఆర్ఎస్‌కు అంత సులువు కాదు. ఈ విషయాన్ని కేటీఆర్ స్వయంగా అంగీకరిస్తున్నారు గనకనే.. తెలంగాణ సెంటిమెంట్ ను నమ్ముకుంటున్నారు. బీఆర్ఎస్ పార్టీ ఎంపీలు లేకపోతే తెలంగాణకు డిల్లీలో వాయిస్ ఉండదని నమ్మించే ప్రయత్నం చేసినా ప్రజలు నమ్మరు. ఎందుకంటే గతంలో వాయిస్ ఇచ్చినా ఒరిగిందేమీ లేదని ప్రజలకు తెలుసు. బీఆర్ఎస్ అని జాతీయ పార్టీగా మార్చినందున... తెలంగాణ కోసమే కొట్లాడుతామని తమను గెలిపించాలని కోరితే ప్రజలు నమ్ముతారా అన్నది కూడా ముఖ్యమే. ఎందుకంటే కాంగ్రెస్ ఎంపిలను గెలిపిస్తే కనీసం ఇక్కడ ప్రభుత్వం ఉన్నందన ఉపయోగం ఉంటుంది. బిజెపి ఎంపిలను గెలిపిస్తే కనీసం కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీగా అయినా ప్రయోజనం చేకూరుతుంది. ఈ రెండు పార్టీలను కాదని బిఆర్ఎస్‌ను గెలిపించడానికి ఉన్న ప్రాతిపదిక ఏదీ లేదనే చెప్పాలి. బిఆర్ఎస్‌తో పలు రాష్ట్రాల్లో కాలుమోపిన వారు తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం పోరాడుతారంటే నమ్మశక్యంగా లేదు.

తెలంగాణకు కేసీఆరే శ్రీరామరక్ష అని జాతీయ పార్టీల చేతుల్లోకి తెలంగాణ వెళ్తే ఆగమవుతుందని ఎంతగా చెప్పినా అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు పట్టించుకోలేదు. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల్లో పట్టించుకుంటారన్న

గ్యారంటీ లేదు. అందుకే బీఆర్ఎస్ ఆందోళన చెందుతోంది. బీఆర్ఎస్‌కు ఇప్పుడు లోక్‌సభ ఎన్నికలు అత్యంత విషమ పరీక్ష. గెలవకపోతే పార్టీని కాపాడుకోవడం చాలా కష్టమవుతుంది. అందుకే వదిలేసిన తెలంగాణ సెంటిమెంట్‌తో మరోమారు ప్రజలను మోసం చేసేందుకు బయలుదేరుతోంది.

# స్కూళ్లకు 12 నుంచి 17 వరకు సంక్రాంతి సెలవులు

### ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ విద్యాశాఖ



హైదరాబాద్, జనవరి 4 (సమ సమాజం): తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ సంక్రాంతి సెలవులను ప్రకటించింది. జనవరి 12వ తేదీ నుంచి 17వ తేదీ వరకు స్కూళ్ల సెలవులు ప్రకటించింది. తిరిగిన 18వ తేదీ నుంచి స్కూల్స్ ప్రారంభం కానున్నాయి. అంటే మొత్తం ఆరు రోజుల పాటు విద్యార్థులకు సంక్రాంతి సెలవులు ఇచ్చారు. ఈ మేరకు విద్యాశాఖ సర్క్యూలర్ జారీ చేసింది. దీని ప్రకారం.. ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్లన్నింటికీ ఈ సెలవులు వర్తిస్తాయి. ప్రైవేట్ స్కూల్ సెలవులు ఇవ్వకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు అధికారులు. జనవరి 12న సాధారణ సెలవు కాగా, 13వ తేదీ రెండో శనివారం, 14వ తేదీన భోగి, 15న సంక్రాంతి, 16వ తేదీన కనుమ పండుగ ఉన్నాయి. 17న సాధారణ సెలవు ఇచ్చారు. మొత్తంగా ఆరు రోజులు సెలవులు ఇచ్చారు. ఇక జనవరి 29వ తేదీ నుంచి స్కూల్ విద్యార్థులకు ఫార్మేటివ్ అసెస్‌మెంట్-4 పరీక్షలను నిర్వహించనున్నట్లు విద్యాశాఖ ప్రకటించింది. స్కూళ్లతో పాటు.. ఇంటర్మీడియట్ కాలేజీలకూ సెలవులు ప్రకటించింది విద్యాశాఖ. జనవరి 13వ తేదీ నుంచి 16వ తేదీ వరకు సెలవులు ఇచ్చింది. ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కాలేజీలన్నీ దీనిని పాటించాలని ఆదేశించారు అధికారులు. ఇక జనవరి 22వ తేదీ నుంచి 29వ తేదీ వరకు ఇంటర్ విద్యార్థులకు ప్రీ ఫైనల్ ఎగ్జామ్స్ నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

# జనం కోసం పనిచేసే వారికే జనబలం !

జనగళం మేమే..జనబలం మేమే. గులాబీదళం..పార్లమెంటులో ఉండాల్సిందే.. ఓటమి తరవాత ఇప్పుడు గులాబీ దళానికి ప్రజలు గుర్తుకు వస్తున్నారు. ప్రజలకు మేమే అండ అని చాటుకోవాలని తపన పడుతు న్నారు. అయినా అహంకారం వీడినట్లుగా కానరావడం లేదు. తమ తప్పుల వల్లనే ఓటమి చెందా మని యువరాజావారు భావించడం లేదు. చేసిన తప్పులపై సమీక్ష చేసుకుని ఉంటే బాగుండేది. కానీ కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వంపై అప్పుడే నిందలు వేసే పనిలోపడ్డారు. నిలదీసే చర్యలకు పూనుకుంటున్నారు. మేడిగడ్డ అక్రమాలపై చీమకుట్టినట్లు లేదు. విద్యుత్ అప్పులపైనా నిజాలు చెప్పడం లేదు. అప్పుల చిట్టా విప్పితే ఆస్తులు సంపాదించి పెట్టామని గొప్పలు చెబుతున్నారు. ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వలేక

నానా తిప్పలు పెట్టారు. 20 ఏళ్లనాటి జర్నలిస్టుల భూ సమస్యను పరిష్కరించలేదు. సుప్రీం తీర్పు ఇచ్చినా ఖాతరు చేయలేదు. రైతుబంధు లాంటి పథకాలతో వేలకోట్లు దుర్వినియోగం చేశారు. దళితబంధులోనూ అదే జరిగింది. వీటిపై విచారణ జరపాలన్న డిమాండ్‌ను సిఎం రేవంత్ రెడ్డి పట్టించుకుంటారా లేదా అన్నది చూడాలి. ఇకపోతే కాళేశ్వరంపై సిబిఐ విచారణ చేయించాలని సన్నాయి నొక్కులు నొక్కుతున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బిజెపి నేతల తీరు కెసిఆర్‌ను రక్షించే ఎత్తుగడ తప్ప మరోటి కాదు. సిబిఐకి అప్పగిస్తే.. ఏం జరుగుతుందో తెలియంది కాదు. అందువల్ల పదేళ్ల పాపాలపై రాష్ట్రంలోనే విచారణ జరగాలి. ఇన్ని పాపాలు చేసి..ఓడిపోయాక కూడా ఆత్మపరిశీలన చేసుకోకుండా అహంకారం ప్రదర్శించే నేతలు అవసరమా అన్నది ప్రజలు ఆలోచన చేయాలి. అలాగే ఇలాంటి వారు మన నాయకులని చెప్పుకోవడానికి సిగ్గుపడాలి. సమీక్షల పేరుతో ఇప్పుడు పార్లమెంటులో అడుగు పెట్టడం ఎలా అని ఆలోచన చేస్తున్నారు. ఆధునిక రాజకీయాల్లో రాటుదేలడమన్నది అంత సులువు కాదు..ప్రజల ఆదరణ పొందడం అన్నదీ మరీ అంత సులవూ కాదు...ప్రజల నాడి తెలుసుకోవాలి. ప్రజల్లో ఆదరణ పొందాలి. ఓట్ల కోసం కాదు..జనం కోసం ఆరాటపడే తపన అన్నది ఎంతమందిలో ఉంటుంది. ప్రజలంతా పార్టీలకు అతీతంగా తమ నాయకు డు ఫలానా అని చెప్పగలిగిన వారు ఎంతమంది ఉంటారు..? అలా ప్రజల గుండెల్లో గూడుకట్టు కుంటే అంతకుమించిన అదృష్టం ఉంటుందా..? అలా ఎంతమంది చేస్తారు..ఎంతమంది జనం నాడి పడతారు... ఎంతమంది జనం గుండెచప్పుడు అవుతారు...అలా జనం గెండెచప్పుడుగా మారుతారు. ఇవీన్ని ఉన్నాయని నమ్మి తెలంగాణ ఉద్యమంలో ప్రజలంతా కెసిఆర్‌ను తమ నాయకుడిగా గుర్తించి తలపైకి ఎత్తుకున్నారు. తెలంగాణ యావత్ సమాజం కూడా కెసిఆర్ వెంటే నడిచారు. తెలంగాణ ఏర్పడ్డ తరవాత కూడా రెండుసార్లు అధికారం కట్టబెట్టారు. కానీ జరిగిందేమిటి..?ప్రజలతో నాకు పనిలేదన్నారు. సిఎంను కలవాల్సిన అవసరం ప్రజలకు ఏమిటని ప్రశ్నించారు. నేనే తెలంగాణ తెచ్చానని తలపొగరు ప్రదర్శించారు. నిస్వార్థ రాజకీయాలను ఔపోసన పట్టే వారు ఎంతమంది...? ప్రజలతో ఓట్లు వేయించుకుని..వారిని దూరం పెట్టి..ఎన్నికల ముందు వంగివంగి సలామ్ కొట్టే ఈ రోజుల్లో అరుదైన నేతలూ ఉన్నారు. అలాంటి వారిలో ఒడిశా సిఎం నవీన్ పట్నాయక్ ముందుంటారు. జనం గుండె చప్పుడుగా మారుతున్నారు. వారి కాలుకు ముల్లు గుచ్చుకుంటే తీయలేకపోవచ్చు..కానీ వారికి నేనున్నాననే ధైర్యం..భరోసా ఇవ్వగలిగే నాయకుల్లో తప్పుకుండా ఉండేవారు అరుదుగా కనిపిస్తారు. అలాంటి వారిలో చప్పున చెప్పుకునే నేత నవీన్ పట్నాయక్. అంతెందుకు మనదగ్గర ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య కూడా అలాంటి వారి కోవలోకే వస్తారు. కానీ ధరణిలో ఆయన భూమి కూడా ఆగమయ్యిందని తెలిసాక...కెసిఆర్ హయాంలో జరిగిన అకృత్యాలు తలచుకుంటేనే బాధేస్తోంది. ప్రజల సమస్యలను ఏనాడూ పట్టించుకోలేదు. తన ఫామ్ హౌజ్‌కు నీళ్ల కోసం

కాళేశ్వరం డిజైన్ చేసుకున్న ఘనుడు కెసిఆర్. ప్రజదర్బార్‌లో వస్తున్న ఫిర్యాదులు చూస్తే బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన నిర్వాకమేమిటో అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి వారిని నమ్మితే మళ్లీ గడీల పాలన తప్పదు. కానీ రేవంత్ రెడ్డి ఇప్పుడు సిఎం అయ్యాక చకచకా నిర్ణయాలు తీసుకుంటున్నారు. ప్రజలకు చేరువయ్యే పనుల గురించి ఆలోచన చేస్తున్నారు. ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారు. నిజానికి నేటి రాజకీయం కత్తి మీద సాములాంటిది. కాంగ్రెస్ లాంటి పార్టీలో ఓ వైపు అధినేతను మెప్పించాలి. పార్టీ ప్రభుత్వం ఇచ్చిన కార్యక్రమాలను ప్రజల చెంతకు చేర్చాలి. ప్రజల అభీష్టం కూడా నెరవేర్చాలి. ఈ రెండూ అంత సులవైన విషయాలు కావు. కానీ రెంటినీ అవలీలగా..త్రికరణశుద్ధిగా అమలు చేసే ధైర్యంతో..దమ్మున్న నేతగా ఎదగడమన్నది మన రేవంత్ రెడ్డికే దక్కింది. ప్రజలంటే ప్రేమ.. అధినేత అంటే ఆప్యాయత..ప్రజల్లో కలసిపోయి పనిచేసే తపన. ఇవన్నీ కలబోస్తే కనిపించే దృశ్యం రేవంత్ సంజీవయ్య అని చెప్పక తప్పదు. జనం గుండెచప్పుడు కావడం వల్లనే.. ప్రజలు తమ ఓటుతో నీవే మా నాయకుడి వని ఓటేసి నిరూపించారు. సామాన్యుడి నుంచి సిఎం పదవికి నేతగా ఎదగడం అన్నది సామాన్య విషయం కాదు. అందుకే పార్టీలకు అతీతంగా ప్రజలు ఆయనంటే ప్రత్యేక అభిమానం చాటుతున్నారు. నెలరోజుల్లోనే విలక్షణ శైలితో రేవంత్ ముందుకు సాగుతున్న తీరు ప్రజల్లో భరోసా కల్పిస్తోంది. పేదలకు మేలు జరిగేలా కార్యక్రమాలను తీసుకుని వెళుతున్నారు. అనేక పథకాలను పట్టాల కెక్కించే ప్రయత్నంలో ఉన్నారు. ఓట్లు వేయించుకుని...తాను ఎమ్మెల్యేగా గెలిచానని, సిఎంను అయ్యానని మిన్నకుంటే ప్రజలు ఎలా ఆదరిస్తారు.. అందుకే..నిరంతరం కృషి చేయాలి. ప్రజలంతా తమ బాధలను ఆత్మీయులకు చెప్పు కున్నంతగా చనువు ఇవ్వాలి. న్యాయం జరుగుతుందన్న నమ్మకం కలిగించాలి. సమస్యలను పరిష్కరిస్తూ.. భరోసా కలిగించాలి. గత ప్రభుత్వం హయాంలో ఇలాంటి అనుభవాలు లేవు. అందుకే కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందన్న దానికన్నా ..రేవంత్ సిఎంగా మంచి చేస్తాడన్న నమ్మకం కలుగుతోంది. అదే రేపటి ఎన్నికల్లో నిలబెడుతుంది.

# ప్రయాణికులకు గుడ్ న్యూస్

### ఫ్యూయల్ ఛార్జీలు తగ్గించిన ఇండిగో




న్యూఢిల్లీ, జనవరి 4 (సమ సమాజం): ప్రయాణికులకు ఇండిగో విమానయాన సంస్థ గుడ్ న్యూస్ చెప్పింది. ఇప్పటివరకు ఉన్న ఫ్యూయల్ ఛార్జీలను టికెట్ల నుంచి తగ్గించింది. ఇండిగోసంస్థ అధికార ప్రతినిధి ఒకరు గురువారం నాడు ఈ విషయాన్ని మీడియాకు వెల్లడించారు. ఇటీవల ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ ధరలను తగ్గాయి. దీంతో టికెట్లపై ఫ్యూయల్ ధరలను సంస్థ తగ్గించింది. దేశీయంగా, అంతర్జాతీయ రూట్లలో ఇంధన ధరలను వెనక్కి తీసుకుంటున్నామని ప్రకటించింది. తగ్గిన ధరలు ఈ రోజు నుంచి అమల్లోకి వస్తాయని స్పష్టంచేసింది. 3 నెలల క్రితం 2023 అక్టోబర్ నెలలో ఏటీఎఫ్ ధరలు పెరిగాయి. దీంతో ఇండిగో (ఎనిటతిఉనీ) తమ టికెట్లపై ధరలను పెంచాల్సి వచ్చింది. ఇప్పుడు తగ్గడంతో వెంటనే తగ్గించేసింది. తమ సంస్థ ఇచ్చిన వాగ్దానానికి కట్టుబడి ఉందని తెలిపింది. ఎయిర్ లైన్ నిర్వహణ ఖర్చులలో ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ భాగం అయ్యిందని.. అందుకోసమే గతంలో ఛార్జీలను పెంచి.. ఇప్పుడు తగ్గించామని వివరించింది. ఇండిగో విమానయాన సంస్థ తీసుకున్న నిర్ణయంపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

# ఎట్టకేలకు కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీ

### హైకోర్టు ఉత్తర్వులతో తొలగిన అడ్డంకి ♦ ఉద్యోగాల భర్తీ ఆదేశాలతో అభ్యర్థుల్లో ఆనందం



హైదరాబాద్, జనవరి 4 (సమ సమాజం): తెలంగాణలో ఎట్టకేలకు కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి లైన్ క్లియర్ అయింది. రాష్ట్రంలో 15,640 కానిస్టేబుల్ పోస్టులకు భర్తీ చేసేందుకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటిదాకా కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి ఉన్న అడ్డంకి తొలగిపోయింది. ఈమేరకు సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును హైకోర్టు డివిజన్ బెంచ్ కొట్టేసింది. దీంతో నియామక ప్రక్రియ ముందుకు సాగనుంది. రాష్ట్రంలో సివిల్ కానిస్టేబుల్ అభ్యర్థులకు నిర్వహించిన పరీక్షలో నాలుగు ప్రశ్నలకు సంబంధించిన మార్కులను కలపాలని సింగిల్ బెంచ్ ఆదేశించిన సంగతి తెలిసిందే. ఆ ఉత్తర్వులను కొట్టేస్తూ హైకోర్టు ధర్మాసనం తాజాగా తీర్పు వెల్లడించింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం సాయంతో నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని పోలీసు నియామక మండలిని హైకోర్టు ఆదేశించింది. అభ్యంతరాలు ఉన్న నాలుగు ప్రశ్నలపై నిపుణుల కమిటీ తేల్చాలని స్పష్టం చేసింది. కానిస్టేబుల్ పరీక్షలో నాలుగు ప్రశ్నలకు ఆప్షన్లను తెలుగులో ఇవ్వకపోవడం వల్ల నష్టపోయామని కొంత మంది అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణలో భాగంగా సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును హైకోర్టు డివిజన్ బెంచ్ కొట్టేసింది. అభ్యర్థులు లేవనెత్తిన ఆ నాలుగు ప్రశ్నలకు ఆప్షన్లను వాడుకలో ఉన్న పదాలనే ఇచ్చామని పోలీసు నియామక మండలి ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లింది. వాదనలు విన్న హైకోర్టుల డివిజన్ బెంచ్ ఆ ప్రశ్నలపై అభ్యర్థులు లేవనెత్తిన అభ్యంతరాలను నిపుణుల కమిటీ తేల్చిన తర్వాత నియామక ప్రక్రియ పూర్తి చేయాలని ధర్మాసనం ఆదేశించింది. నాలుగు వారాల్లోగా కానిస్టేబుల్ నియామక ప్రక్రియ పూర్తి చేయాలని పోలీసు నియామక మండలిని హైకోర్టు ఆదేశించింది. తెలంగాణలో కానిస్టేబుల్ రిక్రూట్ మెంట్ కు రాష్ట్ర హైకోర్టు బ్రేకులు వేసింది. తుది పరీక్ష నుంచి 4 ప్రశ్నలు తొలగించాలని ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. అందరికీ నాలుగు మార్కులు కలిపి ఫలితాలు వెల్లడించాలని ఆదేశించింది. ఈ ప్రక్రియ జరిగిన తరువాతే కానిస్టేబుల్ రిక్రూట్ మెంట్ చేయాలని రాష్ట్ర పోలీస్ రిక్రూట్ మెంట్ బోర్డును హైకోర్టు ఆదేశించింది. 122, 130, 144 ప్రశ్నలను తెలుగులోకి అనువదించలేదని, 57 ప్రశ్న తప్పుగా ఉన్నందున వాటిని ప్రశ్నపత్రం నుంచి తొలగించాలని ఆదేశించింది. దాదాపు 23 ప్రశ్నలకు అభ్యంతరాలు తెలుపుతూ 2022, ఆగస్టు 30వ తేదీన హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలు అయ్యాయి. కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను పోలీసు నియామక మండలి (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) అక్టోబరు 4న విడుదల చేసింది. పోలీసుశాఖ లోని పలు విభాగాల్లో 16,604 పోస్టులకు 15,750 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు టీఎస్ఎల్‌పీఆర్‌బీ ఒక ప్రకటనలో తెలిపింది. కోర్టులో కేసుల దృష్ట్యా పలు పోస్టులకు ఫలితాలు విడుదల చేయలేదని బోర్డు తెలిపింది. పీటీవోలోని 100 డ్రైవర్ పోస్టులు, విపత్తు నిర్వహణ, అగ్నిమాపక శాఖలోని 225 పోస్టులకు ఫలితాలు కోర్టు కేసుల కారణంగా విడుదల చేయలేదని స్పష్టంచేసింది. మరోవైపు, పోస్టుల వారీగా ఎంపికైన అభ్యర్థుల జాబితాలో 12,866 మంది పురుషులు, 2,884 మంది మహిళలు ఉన్నారు. ఎంపిక చేసిన అభ్యర్థులకు సంబంధించిన పూర్తి వివరాలు అక్టోబర్ 5వ తేదీ నుంచి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతున్నట్లు బోర్డు స్పష్టం చేసింది. తెలంగాణలో పోలీసు ఉద్యోగాల నియామక ప్రక్రియలో కొత్త తగాదాలు తలెత్తుతున్నాయి. ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీలో బడుగు, బలహీన వర్గాలకు అన్యాయం జరిగిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళా అభ్యర్థుల కటాఫ్ మార్కుల కంటే, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థుల కటాఫ్ మార్కులు చాలా తక్కువగా ఉండటమే ఇందుకు కారణమని తెలుస్తోంది. తెలంగాణ పోలీసుశాఖలో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 587 సబ్ ఇన్‌స్పెక్టర్;16,604 కానిస్టేబుల్ పోస్టులకు పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు గతేడాది నోటిఫికేషన్ విడుదల చేసింది. లక్షల మంది యువత ఈ ఉద్యోగాల కోసం పోటీ పడ్డారు. నోటిఫికేషన్ విడుదలయ్యే నాటికి ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై కోర్టుల్లో కేసులు ఉన్నాయి. దీంతో ఈ నోటిఫికేషన్‌కు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు వర్తించబోవని బోర్డు పేర్కొంది.

# యోగిని, రామమందిరాన్ని పేల్చేస్తాం

### ఇద్దరిని గుర్తించి అరెస్ట్ చేసిన యూపి పోలీసులు

లక్నో, జనవరి 4 (సమ సమాజం): ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు బాంబు బెదిరింపులు వచ్చాయి. అయోధ్యలో నిర్మించిన రామ మందిరంతో సహా సీఎంను పేల్చేస్తామంటూ కొందరు బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ మేరకు వారు సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. రామమందిరం ప్రాణ ప్రతిష్ఠకు సమయం దగ్గరపడుతున్న సమయంలో ఈ బెదిరింపులు రావడం దేశవ్యాప్తంగా కలకలం రేపుతోంది. ఈ బెదిరింపులతో అప్రమత్తమైన యూపీ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ ఆధారంగా నిందితులు ఓం ప్రకాశ్, తాహర్ సింగ్‌గా గుర్తించారు. ఈ మేరకు ఆ ఇద్దర్నీ అరెస్ట్ చేశారు. గోండాకు చెందిన వీరిద్దరూ పారామెడికల్ ఇనిస్టిట్యూట్‌లో పనిచేస్తున్నారని పోలీసులు గుర్తించారు.

# అనుమతిలేని ఆధార్ కేంద్రం

### తాండూరులో సీజ్ చేసిన అధికారులు



వికారాబాద్, జనవరి 4 (సమ సమాజం): తాండూరులో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రాన్ని సీజ్ చేశారు. తాండూరు తహసీల్దార్ తారాసింగ్ సమక్షంలో కేంద్రంలోని సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. తాండూరు పట్టణంలోని సీసీఐ కాలనీలో సొంత ఇంటిలో జిరాక్స్ సెంటర్ పెట్టాడు. అయితే జిరాక్స్ సెంటర్ నడుపుతూ.. మరోవైపు అనుమతులు లేకుండ ఆధార్ సెంటర్ ను కూడా నిర్వహిస్తున్నాడు. అయితే ఈ విషయాన్ని గమనించిన స్థానికులు తాండూరు తహసీల్దార్ తారాసింగ్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ సైట్ ను అక్రమంగా డౌన్ లోడ్ చేసి.. ఆధార్ తో అక్రమ వసూలు చేస్తున్నారని స్థానికులు ఆరోపించారు. దీంతో బుధవారం(జనవరి 03) తహసీల్దార్ తారాసింగ్ ఆర్ఐ రాజిరెడ్డితో కలిసి కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనుమతులు లేకుండా కేంద్రం నిర్వహస్తున్నట్లు గుర్తించారు. అనంతరం అందులో ఉన్న కంప్యూటర్, స్కానర్ ప్రింటర్ల తదితర సామాగ్రిని సీజ్ చేసి.. తాసిల్దార్ కార్యాలయానికి తరలించారు. అనుమతులు పొందిన తరువాతే ఆధార్ సెంటర్ నిర్వహించాలని అధికారులు స్పష్టం చేశారు.

# పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవు: కెటిఆర్



హైదరాబాద్, జనవరి 4 (సమ సమాజం): పార్టీ ఆదేశాలు ధిక్కరిస్తే కఠిన చర్యలు తప్పవని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నివాసంలో జగిత్యాల జిల్లా జడ్పీ చైర్మన్ దావ వసంతసురేష్, జడ్పీటీసీ సభ్యులు, జిల్లా నాయకులు గురువారం కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జడ్పీచైర్‌పర్సన్ దావ వసంత సురేష్‌పై వస్తున్న అవిశ్వాస తీర్మానం పూర్తి అబద్దమని , పూర్తి పదవికాలం పాటు ఆమెనే కొనసాగుతారని జడ్పీటీసీలు కేటీఆర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని జడ్పీ చైర్మన్, జిల్లా పరిషత్ సభ్యులకు దిశా నిర్దేశర చేశారు.

# అద్దెబస్సుల యాజమానులతో చర్చలు సఫలం



(మొదటి పేజి తరువాయి) అద్దె బస్సు ఓనర్లతో సమావేశంలో పలు అంశాలు చర్చించామని పేర్కొన్నారు. వారు కొన్ని సమస్యలను మా దృష్టికి తీసుకొచ్చారు. వారంరోజుల్లో సమస్యలు పరిష్కరిం చేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఇందుకు గాను సమస్యల పరిష్కారం కోసం ఒక కమిటీ వేస్తామని తెలిపారు. రేపటి నుంచి ఎలాంటి సమ్మె ఉండదని, యధావిధిగా అ÷-దదె బస్సులు నడుస్తాయని స్పష్టం చేశారు. సంక్రాంతికి కూడా ఫ్రీబస్ సర్వీస్ ఉంటుందని అలాగే సంక్రాంతికి స్పెషల్ బస్సులను కూడా నడుపుతామని సజ్జనార్ పేర్కొన్నారు. కాగా, అంతకుముందు అ÷-దదె బస్సు ఓనర్ల సంఘం నేతలు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిశారు. సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం స్పందించకుంటే రేపటి నుంచి బస్సులు నడుపమని స్పష్టం చేశారు. నేటి నుంచి యాథావిధిగా అద్దె బస్సులు నడుస్తాయని, సంక్రాంతికి కూడా ఉచిత బస్సు సర్వీసులు ఉంటాయని.. స్పెషల్ బస్సులు నడుపుతామని సజ్జనార్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో 'మహాలక్ష్మి' పథకం కింద ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో, పల్లె వెలుగు బస్సుల్లో డిసెంబర్ 9 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో బస్సుల్లో రద్దీ పెరిగింది. ప్రయాణికుల సంఖ్య రెండింతలు అయ్యింది. ముఖ్యంగా ఎక్స్ ప్రెస్ బస్సులు, గ్రామాలకు వెళ్లే చివరి బస్సుల్లో రద్దీ మరీ ఎక్కువగా ఉంటోంది. కొన్ని ప్రాంతాల్లో బస్సుల కిటీకీల్లోంచి సైతం మహిళా ప్రయాణికులు ఎక్కుతున్నారు. ఫుట్ బోర్డుల వద్ద సైతం వేలాడుతూ ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో అద్దె బస్సుల యజమానులు ఆందోళనకు గురవుతున్నారు. బస్సులు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయంటూ వాపోయారు. కేఎంపీఎల్ కూడా రావడం లేదని, అందుకే సమ్మెకు వెళు న్నట్లు ప్రకటించారు. బస్సుల్లో పరిమితికి మించి ప్రయాణికులు వెళ్లడంతో టైర్లు వేడెక్కి పేలే అవకాశం ఉంది. కమాన్ కట్టలపై అధిక లోడు పడి విరిగే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని చెప్పారు. ఈ మేరకు సమ్మెకు వెళ్తున్నట్లు ఆర్ఎంకు నోటీసులిచ్చారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలిసి వినతి పత్రం సమర్పించి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. అయితే, గురువారం సంస్థ ఎండీ సజ్జనార్ వారిని పిలిపించి సమస్యలపై చర్చించారు. సమస్యలు పరిష్కరిస్తామన్న సజ్జనార్ హామీతో వారు సమ్మెకు వెళ్లాలన్న నిర్ణయాన్ని విరమించుకున్నారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా 2,700 అద్దె బస్సులు నడుస్తున్నాయి. మరోవైపు, సంక్రాంతి పండుగ సందర్భంగా హైదరాబాద్ నుంచి 4,484 ప్రత్యేక బస్సులను నడిపేలా టీఎస్ఆర్టీసీ ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ నెల 6 నుంచి 15వ తేదీ వరకూ హైదరాబాద్ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలతో పాటు పొరుగు రాష్ట్రాలైన ఏపీ, కర్ణాటక, మహారాష్ట్రలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. 626 బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్లకు అవకాశం కల్పించినట్లు చెప్పారు. భాగ్యనగరం నుంచి ఏపీకి రద్దీ దృష్ట్యా 1,450 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు పేర్కొన్నారు. అటు, రాష్ట్రంలో 'మహాలక్ష్మి' పథకం విజయవంతంగా అమలవుతున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ స్కీం కింద ఇప్పటివరకూ 6.50 కోట్ల మంది మహిళలు ప్రయాణాలు సాగించినట్లు తెలుస్తుండగా, మంత్రులు అధికారులు, సిబ్బందిని అభినందించారు. టీఎస్ఆర్టీసీకి పూర్తి సహకారాలు అందిస్తామని, సిబ్బందికి రావాల్సిన బకాయిలు, సంస్థ అప్పులు, పీఎఫ్, ఇతర సెటిల్ మెంట్లకు సంబంధించిన నిధులపై సమీక్షించి త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ప్రతి రోజూ 27 లక్షల మంది మహిళలు ప్రయాణిస్తున్నారని, దాదాపు రూ.10 కోట్ల విలువైన జీరో టికెట్లు మంజూరు చేస్తున్నామని అధికారులు వివరించారు. సంస్థను బలోపేతానికి కావాల్సిన అన్ని చర్యలు తీసుకుంటామని, ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలపై ఆలోచిస్తున్నట్లు మంత్రి పొన్నం తెలిపారు. లాజిస్టిక్స్, కమర్షియల్, తదితర టికెటేతర ఆదాయంపైనా దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు.

# ఢిల్లీలో బిజీగా సిఎం రేవంత్ పర్యటన



(మొదటి పేజి తరువాయి) న్యూఢిల్లీ,జనవరి 4 (సమ సమాజం): ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన బిజీబిజీగా కొనసాగుతోంది. కేంద్ర మంత్రులతో వరుసగా భేటీ అయ్యారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు విషయాలపై చర్చించారు. అంతకుముందు కేంద్ర పట్టణ అభివృద్ధిశాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు.. విభజన అంశాలు, నిధుల రాకపై చర్చించారు. అ తర్వాత కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావాత్ తోనూ రేవంత్ భేటీ అయ్యారు. పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా ఇవ్వాలని వినతిపత్రం అందించారు.సీఎం రేవంత్ తో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, జాయింట్ డైరెక్టర్ ఆమ్రపాలి ఉన్నారు. అలాగే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా ఉన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి గురువారం ఢిల్లీ బయల్దేరి వెళ్లారు. ఉదయం 11 గంటలకు ఏఐసీసీ కార్యాలయంలో నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నేతృత్వంలో ఈ భేటీ జరిగింది. రాహుల్ గాంధీ చేపటనున్న భారత్ న్యాయ యాత్ర పై లోక్ సభ ఎన్నికల్లో ఎలా ముందుకెళ్లాలన్నదాని పై చర్చించారు. ఈ సమావేశానికి అన్ని రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నేతలు, హాజరయ్యారు. లోక్ సభ ఎన్నికల్లో పొత్తులు, పై ఎత్తుల విషయం, తెలంగాణలో ఖాళీగా ఉన్న నామినేటడ్ పోస్టుల విషయంపై చర్చించినట్లు తెలుస్తోంది.

# బిసిల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



(మొదటి పేజి తరువాయి) ఘాట్‌లు, హెయిర్ కటింగ్ సెలూన్‌లకు 250 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తుందని తెలిపారు. ఆర్థికశాఖ బడ్జెట్‌ను విడుదల చేయాలని ఈ మేరకు మంత్రి కోరారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను క్రమానుగతంగా తప్పకుండా అమలు చేస్తుందని హామినిచ్చారు. ఆరు గ్యారంటీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా బీసీలకు విద్య, ఉపాధి అవకాశాల్లో కల్పనలో కృషి చేయాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారు అధికారులను ఆదేశించారు. తెలంగాణ బీసీ సంక్షేమ శాఖ పనితీరుని, ప్రస్తుతం ఉన్న గురుకుల విద్యాలయాలు, బీసీ కార్పొరేషన్ రుణాలు , ఆత్మగౌరభవనాలు, ఫెడరేషన్లకు సంబంధించిన అనేక విషయాలను ఈ సమావేశంలో మంత్రి సమీక్షించారు. సంక్షేమాన్ని ప్రజలకు అందించటం ఒక అదృష్టంగా భావించి అధికారులందరూ బీసీల సామగ్రాభివృద్ధి కోసం, నిరుపేద లైన బీసీ ప్రజల సంక్షేమనీ, వారిని ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేయడం కోసం నిబద్దతతో పని చేయాలని ఈ సందర్భంగా మంత్రి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని బీసీలకు విద్యా ఉపాధి అవకాశాలు కల్పించడానికి అందరూ చిత్తశుద్ధితో పనిచేయాలని ఆయన సూచించారు. బిసి సంక్షేమ శాఖలోని హాస్టల్లో విద్యార్థుల సంఖ్య , అవసరమైన నిధులు , వసతుల గురించి, రాష్ట్రం లోని స్టడీ సర్కిల్లో ఇస్తున్న కోచింగ్ గురించి ఈ సమావేశంలో సమీక్షించారు. గురుకుల పాఠశాలల పనితీరు, విద్యార్థులు సాధిస్తున్న ఉత్తీర్ణత శాతం గురించి మంత్రి సమీక్షించారు. బుధవారం సచివాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం ,అడిషనల్ సెక్రెటరీ పద్మ, ఎంబీసీ సీఈఓ అలోక్ కుమార్, మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల విద్యాలయాల సొసైటీ కార్యదర్శి డాక్టర్ మల్లయ్య బట్టు, చంద్రశేఖర్, సంధ్య, విమల, శ్రీనివాస్ రెడ్డి , మద్దిలేటి, మంజుల, ఉదయ్ ప్రకాష్, తిరుపతి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఖర్గే సమక్షంలో కండువా కప్పిన రాహుల్



(మొదటి పేజి తరువాయి) ఏ బాధ్యత ఇచ్చినా నిబద్ధతో పనిచేస్తానని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి గొప్ప నేత అని అన్నారు. ఆయన ఎప్పుడూ కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశ లూ శ్రమించారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ దేశంలోనే అతిపెద్ద సెక్యులర్ పార్టీ అని అన్నారు. అన్ని వర్గాలను కలుపుకుంటూ, అందరినీ కలుపుతూ పని చేస్తుందన్నారు. ఒక క్రిస్టియన్‌గా మణిపూర్‌లో చర్చిల కూల్చివేత తనను తీవ్రంగా బాధించిందన్నారు. సెక్యులర్ పార్టీ అధికారంలో లేకపోతే ఏం జరుగు తుందనడానికి ఇదొక నిదర్శనమని పేర్కొన్నారు. భారత్ జోడో యాత్ర రాహుల్ గాంధీపై నమ్మకాన్ని తనతో పాటు ప్రజలందరిలో పెంచిందన్నారు. తెలంగాణలో కేసీఆర్ వ్యతిరేక ఓటు చీలకూడదన్న ఉద్దేశంతో కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించి పోటీ చేయలేదని వెల్లడించారు. రాహుల్ గాంధీని ప్రధానిగా చూడాలన్నది తన తండ్రి వైఎస్సార్ ఆశయమని వైఎస్ షర్మిల పేర్కొన్నారు. గతరాత్రి భర్త అనిల్‌తో కలిసి షర్మిల ఢిల్లీ చేరుకున్నారు. గురువారం ఉదయం షర్మిలతో పాటు ఏపీ కాంగ్రెస్ నేతలు, షర్మిల అనుచరులు ఏఐసీసీ కార్యాలయానికి వచ్చారు. ఇదిలావుంటే కాంగ్రెస్‌లో చేరిన షర్మిలకు ఆంధ్ర పీసీసీ పగ్గాలు అప్పగించేందుకే రాహుల్ మొగ్గు చూపుతున్నారు. ఇటీవల ఢిల్లీలో రాష్ట్ర నేతలతో జరిగిన సమావేశంలో.. ఆయన, మల్లికార్జున ఖర్గే ప్రత్యేకంగా షర్మిల ప్రస్తావన తీసుకొచ్చారు. రాష్ట్రానికి చెందిన ఇద్దరు మాజీ ఎంపీలు తప్ప ఆమె రాకను అందరూ స్వాగతించారు. పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు తన అభిప్రాయాన్ని వెల్లడిస్తుండగా.. రాహుల్ జోక్యం చేసుకుని.. రాష్ట్ర కాంగ్రెస్‌లో షర్మిలకు ప్రాధాన్యం ఉంటుందని స్పష్టం చేశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశయ సాధనం కోసం కాంగ్రెస్ పార్టీలో పని చేస్తానని వైఎస్ షర్మిల తెలిపారు. తనకు ఏ బాధ్యత అప్పగించినా నిబద్ధతతో పని చేస్తానని ఈ సందర్భంగా షర్మిల స్పష్టం చేశారు. 'కాంగ్రెస్ పార్టీలో చేరినందుకు సంతోషంగా ఉంది. దేశంలో అతి పెద్ద సెక్యులర్ పార్టీ కాంగ్రెస్. అన్ని వర్గాలను ఏకం చేసిన ఘనత హస్తం పార్టీది. వైఎస్సార్టీపీని కాంగ్రెస్ లో విలీనం చేసినందుకు సంతోషంగా ఉంది. వైఎస్ జీవితాంతం కాంగ్రెస్ పార్టీ కోసం పని చేశారు. నేను వైఎస్ అడుగుజాడల్లో నడుస్తాను.' అని షర్మిల పేర్కొన్నారు. ఇవాళ్టి నుంచి కాంగ్రెస్ లో వైఎస్సార్టీపీ ఓ భాగమని, కార్యకర్తలు, నేతలు, అభిమానులు కాంగ్రెస్ పార్టీ లక్ష్యాల మేరకు పని చేస్తారని చెప్పారు. 'మణిపూర్ లో హింస చాలా బాధ కలిగించింది. ఈ పరిస్థితులు మారాలంటే దేశంలో సెక్యులర్ పార్టీ అధికారంలోకి రావాలి. వైఎస్ జీవితాంతం కాంగ్రెస్ పార్టీ కోసమే కష్టపడి పని చేశారు. మా నాన్న అడుగుజాడల్లోనే నేనూ నడుస్తాను. కేసీఆర్ వ్యతిరేక ఓటు చీలకూడదనే తెలంగాణ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉన్నాం. రాహుల్ గాంధీని ప్రధానిగా చూడాలన్నది మా నాన్న కల. అది నెరవేర్చడానికి మనస్ఫూర్తిగా పనిచేస్తాను. పార్టీ ఏ బాధ్యత ఇచ్చినా నా శక్తివంచన లేకుండా కృషి చేస్తాను. అధిష్టానం ఆదేశిస్తే ఏపీలోనే కాదు అండమాన్ లో పని చేయడానికైనా సిద్ధం.' అంటూ షర్మిల వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీలో షర్మిల చేరిన నేపథ్యంలో ఆమెకు అప్పగించే బాధ్యతలపై ఆసక్తి నెలకొంది. ఏఐసీసీలో పదవి ఇస్తారా. లేదా ఏపీ కాంగ్రెస్ బాధ్యతలు అప్పగిస్తారా.? అనేది తెలియాల్సి ఉంది. అయితే, షర్మిలకు ఆంధ్రప్రదేశ్ పీసీసీ పగ్గాలు అప్పగించేందుకు రాహుల్ మొగ్గు చూపుతున్నారని సమాచారం. రాష్ట్ర కాంగ్రెస్‌లో షర్మిలకు ప్రాధాన్యం ఉంటుందని రాహుల్ గాంధీ స్పష్టం చేసినట్టు తెలుస్తోంది. దీంతో ఆమెకు ఏపీ పగ్గాలు అప్పగించే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. ఒకవేళ, అదే జరిగితే ఏపీలో అన్నాచెల్లెళ్ల మధ్య రాజకీయం మరింత ఆసక్తిగా మారే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అప్పట్లో, వైసీపీ తరఫున ఆమె పాదయాత్ర చేసి తన అన్న జగన్ కు అండగా నిలిచారు. అనంతరం తెలంగాణలో పార్టీని స్థాపించి ఇప్పుడు కాంగ్రెస్ లో విలీనం చేశారు. ఈ క్రమంలో రాజకీయం ఎలాంటి మలుపులు తిరుగుతుందో అనేది అందరిలోనూ ఆసక్తిగా మారింది.

# కాళేశ్వరలో బిజెపి వాటా నిరూపించాలి



(మొదటి పేజి తరువాయి) బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదనే విషయం తెలుసు.. అయినా రేషన్ కార్డు అడుతున్నారని మండిపడ్డారు. తలెంగాణ ఉద్యమకారులు ఎఫ్ఐఆర్ కాపీలు పెట్టాలా?.. ఉద్యమకారులు అరెస్టై జైలుకు వెళ్లిన వివరాలన్నీ ప్రభుత్వం దగ్గరనే ఉన్నాయి.. మళ్లీ ఎఫ్ఐఆర్ కాపీలు అడగడమేంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే.. ఎలాంటి దరఖాస్తులు లేకుండా అర్హులైన లబ్దిదారులందరికీ పథకాలు అమలు చేయాలని కిషన్ రెడ్డి అన్నారు. రేవంత్ రెడ్డి ఏ విధంగా ఆదాయం సంపాదించారో ప్రతీ తెలంగాణ బిడ్డకు తెలుసన్నారు. ముఖ్యమంత్రి ప్రస్థానం ఎలా మెదలైందో.. తన ప్రస్థానం ఎలా మెదలైందో తెలంగాణ ప్రజలకు తెలుసన్నారు. సీఎం ఆదాయం ఎంతో.. తన ఆదాయం ఎంతో విచారణకు సిద్ధమని సవాల్ విసిరారు. కాళేశ్వరంపై పూర్తి వివరాలు ఎంపీ హోదాలో సీబీఐకు ఇస్తానన్న రేవంత్..సీఎంగా ఇప్పుడెందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. తెలంగాణకు సీబీఐ రాకుండా కేసీఆర్ చట్టం చేశారని... లేకుంటే కేంద్రమే సీబీఐ విచారణ జరిపేదని చెప్పుకొచ్చారు. 15 రోజుల్లోనే ఫార్మా సిటీపై యూ టర్న్ ఎందుకు తీసుకున్నారో సీఎం రేవంత్ రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. ఫార్మా కంపెనీల లాబీయింగ్‌కు ముఖ్యమంత్రి లొంగిపోయారన్నారు. రాహుల్ గాంధీ ఉన్నంత వరకు ప్రధానమంత్రిగా మోదీనే ఉంటారన్నారు. రాహుల్ ప్రధాని కావాలని ఎవరూ కోరుకోవడం లేదని, అలాంటి అవకాశం కూడా లేదన్నారు. ప్రపంచంలో మోడీకి ఉన్న ఆదరణెళి ఇందుకు నిదర్శనమన్నారు. అభయ హస్తం పేరుతో తెలంగాణ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని విమర్శలు గుప్పించారు. దరఖాస్తు అవసరం లేకుండా ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ÷ార్లమెంట్ ఎన్నికల వరకు కాలయాపన కోసమే ఆరు గ్యారంటీల కోసం దరఖాస్తులు అని అన్నారు. పార్లమెంట్ ఎన్నివల వరకు కాంగ్రెస్ నేతల ఇంటి చుట్టూ ప్రజలను తిప్పుకోవాలని భావిస్తోందన్నారు. రేషన్ కార్డ్స్ ఇవ్వకుండా .. రేషన్ కార్డుల వివరాలు ఎలా అడుగుతారని ప్రశ్నించారు. రైతు భరోసా, గ్యాస్ సిలిండర్ వాడే వారి డేటా ప్రభుత్వం వద్ద ఉంటోందన్నారు. కాంగ్రెస్ అభయ హస్తంతో ప్రజలకు ఎలాంటి లబ్ది చేకూరదన్నారు. ప్రధాని మోదీ మెడిసిన్ ప్రపంచానికి సంజీవని అని అన్నారు. 22న అయోధ్య రాముడి ప్రాణప్రతిష్ఠ క్యార్యక్రమం కోసం ప్రతి దేవాలయంలో ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేస్తామన్నారు. సంక్రాంతి నుంచి 22వ వరకు ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయన్నారు. అన్ని దేవాలయాల్లో బీజేపీ ఆధ్వర్యంలో ఎల్ఈడీ స్క్రీన్స్ ఏర్పాటు చేయనున్నట్లు కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

## కానిస్టేబుల్ ఎంపికలకు తొలగిన అడ్డంకి



(మొదటి పేజి తరువాయి) ప్రశ్నలకు మార్కులు కలపాలని గతంలో సింగిల్ బెంచ్ తీర్పు ఇచ్చింది. సింగిల్ బెంచ్ తీర్పును సెలక్ట్ అయిన కానిస్టేబుల్ అభ్యర్థులు సవాల్ చేశారు. ఈ ప్రశ్నల తప్పిదాలపై ఇండిపెండెంట్ ఎక్సపర్ట్ కమిటీ పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది. నాలుగు వారాల్లో కానిస్టేబుల్ సెలక్షన్ ప్రాసెస్ పూర్తి చేయాలని పోలీస్ రిక్ర్యూర్మెంట్ బోర్డుని హైకోర్టు ఆదేశించింది.

# అసెంబ్లీ ఎన్నికల్లో సాయం కోసం జగన్ తంటాలు




(మొదటి పేజి తరువాయి) నారాయణ అన్నారు. తన ఇంట్లో జగనే గొడవ సృష్టించుకుని ఇతరులను నిందిస్తున్నారన్నారు. చెల్లిని, బాబాయ్‌ను దూరం చేసుకున్నారని.. అధికారానికి కూడా దూరమవుతారని జోస్యం చెప్పారు. పొత్తు పేరుతో చంద్రబాబును బీజేపీ నష్టపరచాలని చూస్తోందని అన్నారు. తమను ప్రశ్నించిన వారిని కేంద్రం 17ఏ పేరుతో బెదిరిస్తోందని ఆరోపించారు. చంద్రబాబు, జగన్‌ను కూడా 17ఏతో బీజేపీ భయపెట్టిస్తోందని నారాయణ అన్నారు. ఓట్ల కోసమే మాజీ సీఎం కేసీఆర్‌ను జగన్ కలిశారని విమర్శలు గుప్పించారు. ఎన్నికల్లో సాయం కోసమే జగన్.. కేసీఆర్ దగ్గరకి వచ్చారన్నారు. కేసీఆర్‌ను అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించాలని ప్రయత్నించి జగన్ విఫలమయ్యారన్నారు.


# కెసిఆర్‌కు జగన్ పరామర్శ



(మొదటి పేజి తరువాయి) నందినగర్ లో కేసీఆర్ నివాసానికి జగన్ చేరుకున్నారు. అక్కడ జగన్ కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఇతర పార్టీ నేతలు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం, కేసీఆర్ ను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. కాగా, ఇటీవలే కేసీఆర్ తన ఫామ్‌హౌజ్ లో జారిపడడంతో తుంటి ఎముక విరిగిన విషయం తెలిసిందే. సోమాజీగూడ యశోద ఆస్పత్రిలో ఆయనకు వైద్యులు హిప్ రీప్లేస్మెంట్ సర్జరీ చేశారు. అనంతరం కొద్ది రోజుల చికిత్స అనంతరం డిశ్చార్జ్ చేశారు. ప్రస్తుతం గాయం నుంచి కోలుకుంటున్నారు. సీఎం కేసీఆర్ ను పరామర్శించిన అనంతరం సీఎం జగన్ లోటస్ పాండ్‌కు వెళ్ళారు. దాదాపు రెండేళ్ల తర్వాత జగన్, లోటస్ పాండ్ లో నివాసానికి వెళ్లనున్నారు.

# స్కూల్ బస్ కిందపడి చిన్నారి మృతి

## డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని గుర్తింపు



హైదాబాద్,జనవరి 4 (సమ సమాజం): నగరంలో దారుణం చోటు చేసుకుంది. తండ్రితో కలిసి అన్నను స్కూల్ బస్ ఎక్కించేందుకు వచ్చిన చిన్నారి చెల్లెలు బస్ కింద పడి మృత్యువాత పడింది. అన్నను బస్ ఎక్కించాక తండ్రి వద్దకు పరుగెత్తుకు వచ్చేందుకు చత్నించగా బస్ కిందపడి చనిపోయింది. ఈ ఘటన పలువురుని కంటతడి పెట్టించింది. వివరాల్లోకి వెళ్తే.. హబ్సిగూడ రవీంద్రనగర్‌లో జాన్సన్ గ్రామర్ స్కూల్ బస్సు టైర్ కింద పడి రెండేళ్ల చిన్నారని మృతి చెందింది. బస్ డ్రైవర్ నిర్లక్ష్యంగా నడుపడంతో స్కిడ్ అయి.. బస్ టైర్ కింద పడి మృతి చెందిందని స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అప్పటివరకు కండ్లముందే ముద్దు ముద్దు మాటలతో అల్లరి చేస్తూ ఆ కుటుంబంలో ఆనందాలు నింపిన చిన్నారి.. అంతలోనే విగతజీవిగా మారడంతో తల్లిందడ్రుల రోదనలు మిన్నంటాయి.

# పెట్టుబడులు పెడతామంటే విమర్శలా

ఆదానీ గ్రూప్ రాకపై మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్,జనవరి 4 (సమ సమాజం): అదానీ గ్రూప్ పెట్టుబడులపై వస్తున్న విమర్శలపై మంత్రి శ్రీధర్ బాబు కీలక వ్యాఖ్యలు చేశారు. గురువారం నాడు సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ..రాష్ట్రానికి పెట్టుబడులు కావాలని.. పెట్టుబడులు పెట్టేవాళ్లకి వెల్కమ్ చెబుతున్నామన్నారు. అందులో భాగంగానే తెలంగాణలో అదానీ పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చారని తెలిపారు. రాష్ట్ర ప్రగతిలో అదానీ గ్రూప్ కలిసివస్తామని చెప్పారు. అదానీ గ్రూప్ వాళ్ల పెట్టుబడులు ఎవరికి తెలియకుండా చేసిందేమీ కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అంతా పారదర్శకమేనని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

## జనసేన ఎప్పటికీ మా మిత్రపక్షమే: పురందేశ్వరి



అమరావతి,జనవరి 4 (సమ సమాజం): జనసేన తమ మిత్ర పక్షమే అని ఏపీ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి ఏ పార్టీలో చేరితే తమకెందుకు అని, తమ పార్టీ బలోపేతం కోసం తాము పని చేస్తామని పురందేశ్వరి తెలిపారు. నాదెండ్లతో భేటీ మర్యాద పూర్వకమేనని, శివప్రకాష్ జీని కలవడానికే మనోహర్ వచ్చారని అన్నారు. షర్మిల ఏ పార్టీలో చేరితే మాకెందుకు. మా పార్టీ బలోపేతం కోసం మేము పని చేస్తాం అన్నారు. పొత్తులతో పాటు పార్టీ బలోపేతంపై చర్చించాం. పొత్తులపై మా అభిప్రాయాలను అధిష్టానానికి వివరిస్తాం. పొత్తులపై అంతిమ నిర్ణయం మా అధిష్టానం చూసుకుంటుందని పురందేశ్వరి స్పష్టం చేశారు.

## మినిమమ్ బ్యాలెన్స్ పేరుతో సర్‌ఛార్జీలకు బ్రేక్

బ్యాంకులను ఆదేశించిన ఆర్‌బిఐ



ముంబై, జనవరి 4 (సమ సమాజం): బ్యాంక్‌ఖాతా ఉండి ఎలాంటి లావాదేవీలు జరపని వినియోగదారులపై విధించే ఛార్జీలకు సంబంధించి ఆర్‌బీఐ కీలక ఆదేశాలు జారీ చేసింది. ఏళ్లు గడుస్తున్నా బ్యాంక్‌ఖాతాలో ఎలాంటి లావాదేవీలు జరపని వారి అకౌంట్‌లో మినిమం బ్యాలెన్స్ లేదంటూ ఛార్జీలు వేస్తూంటారు. ఇకపై ఎలాంటి లావాదేవీలు లేకుండా ఇన్‌ఆపరేటివ్‌గా ఉన్న ఖాతాలపై మినిమం బ్యాలెన్స్ లేదంటూ ఛార్జీలు వేయకూడదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకులను ఆదేశించింది. అలాగే స్కాలర్‌షిప్ నగదును పొందడం కోసం లేదా ప్రత్యక్ష నగదు బదిలీల కోసం ఓపెన్‌చేసిన బ్యాంక్‌ఖాతాల్లో రెండేండ్లకుపైగా ఎలాంటి లావాదేవీలు జరగకపోయినా వాటిని ఇన్‌ఆపరేటివ్ ఖాతాలుగా పరిగణించకూడదని స్పష్టం చేసింది. అన్÷-లకెయిమ్డ్ బ్యాంక్ డిపాజిట్లను తగ్గించే చర్యల్లో భాగంగా, ఇన్‌ఆపరేటివ్ ఖాతాలపై విడుదల చేసిన తాజా సర్క్యులర్‌లో బ్యాంకులకు ఆర్బీఐ ఈ సూచనలు చేసింది. ఏప్రిల్ 1 నుంచి ఈ కొత్త మార్గదర్శకాలు అమల్లోకి రానున్నాయి. బ్యాంకింగ్ వ్యవస్థలో పేరుకుపోయిన అన్÷-లకెయిమ్డ్ డిపాజిట్లను తగ్గించడానికి, సదరు డిపాజిట్లు వాటి నిజమైన హక్కుదారులు/ వారసులకు చేరడానికి బ్యాంకులు, ఆర్బీఐ ప్రస్తుతం తీసుకుంటున్న చర్యలకు ఈ కొత్త మార్గదర్శకాలు ఉపయోగపడుతాయని సర్క్యులర్ ద్వారా తెలిసింది.

# రాహుల్ పాదయాత్ర పేరులో స్వల్ప మార్పు

భారత్ జోడో న్యాయ యాత్రగా నాయకరణం



న్యూఢిల్లీ, జనవరి 4 (సమ సమాజం): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేయబోయే భారత్ న్యాయ యాత్ర పేరులో స్వల్ప మార్పు జరిగింది. ఈ పాదయాత్రను భారత్ జోడో న్యాయ యాత్రగా మార్చారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ గురువారం వెల్లడించారు. అయితే, తొలిదశలో జరిగిన భారత్ జోడో యాత్ర పూర్తిగా పాదయాత్ర కాగా.. న్యాయ్ యాత్ర మాత్రం ఎక్కువగా బస్సుల్లో సాగుతుంది. అక్కడక్కడా పాదయాత్ర ఉంటుందని కాంగ్రెస్ నేతలు వెల్లడించారు. జనవరి 14న ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్ లో మొదలై 66 రోజులు పాటి సాగి గుజరాత్ లోని మహాత్మా గాంధీ పుట్టిన ఊరైన పోరుబందర్ వద్ద మార్చి 30న ముగుస్తుంది. 66 రోజులపాటు 15 రాష్ట్రాల్లోని 110 జిల్లాల మీదుగా దాదాపు 6,713 కిలోమీటర్ల పాటు యాత్ర కొనసాగనుంది. దాదాపు 100 లోక్‌సభ స్థానాల్లో చేపట్టే ఈ యాత్రలో అన్ని వర్గాల వారితో రాహుల్ గాంధీ మాట్లాడతారు. మణిపూర్‌లోని 4 జిల్లాలు, 2 లోక్‌సభ, 11 అసెంబ్లీలను కవర్ చేస్తుంది.నాగాలాండ్‌లో 257 కిలోమీటర్లు, 5 జిల్లాలు 2 రోజుల్లో కవర్ చేస్తారు. అస్సాంలో 833 కిలోమీటర్లు, 17 జిల్లాల్లో 8 రోజుల పాటు సాగుతుంది. పశ్చిమ బెంగాల్‌లో 7 జిల్లాలను కవర్ చేస్తూ 5 రోజుల్లో 523 కి.మీ. పూర్తి చేస్తారు. జార్ఖండ్‌లో 8 రోజుల్లో 13 జిల్లాల్లో 804 కి.మీ., ఒడిశాలో 4 జిల్లాల్లో 4 రోజుల్లో 341 కి.మీ., బీహార్‌లో 7 జిల్లాల్లో 4 రోజుల్లో 425 కి.మీ., యూపీలోని 10 జిల్లాల్లో 11 రోజుల్లో గరిష్టంగా 1074 కి.మీ.,ఛత్తీస్‌గఢ్‌లో 7 జిల్లాల్లో 5 రోజుల్లో 436 కి.మీ.,గు÷ఎజరాత్‌లో 7 జిల్లాల్లో 5 రోజుల్లో 445 కి.మీ.,రాజస్థాన్‌లో 2 జిల్లాల్లో ఒకేరోజు 128 కి.మీ., మహారాష్ట్రలో 7 జిల్లాల్లో 5 రోజుల్లో 480 కి.మీ.యాత్రను చేపడతారు.

# బ్రెయిలీ లిపితో అంధుల జీవితాల్లో వెలుగులు

లిపిని సద్వినియోగం చేసుకొంటే జీవితంలో ఉన్నత శిఖరాలు

ఆత్మస్థైర్యంతో అడుగేసే అన్ని రంగాల్లోనూ ప్రతిభ చూపాలి

ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు



విజయవాడ,జనవరి 4 (సమ సమాజం): అంధుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న బ్రెయిలీ లిపిని సద్వినియోగం చేసుకొని.. జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. అంధుల ఆశాజ్యోతి లూయిస్ బ్రెయిలీ 215వ జయంతి సందర్భంగా గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో జిల్లా విభిన్న ప్రతిభావంతులు, టీజీ, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ బ్రెయిలీ దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ డిల్లీరావు.. విభిన్న ప్రతిభావంతులు, అధికారులతో కలిసి లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్‌చేసి.. శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ ఎలాంటి సౌకర్యాలూ లేని రోజుల్లో చేతి వేళ్లతో చుక్కలను స్పృశించడం ద్వారా చదవగలిగే లిపిని ఆవిష్కరించడం ద్వారా లూయిస్ బ్రెయిలీ మహా మనిషిగా నిలిచారని.. ఆ లిపిని ఉపయోగించుకొంటూ ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేసి నచ్చిన రంగంలో ఎదిగేందుకు కృషిచేయాలన్నారు. బాల్యంలో ప్రమాదవశాత్తు చూపు కోల్పోయినా ధైర్యంతో ముందడుగు వేసి సరళమైన లిపిని లూయిస్ బ్రెయిలీ ఆవిష్కరించారన్నారు. చూపు లేదని కలత చెందకుండా బ్రెయిలీ చూపిన మార్గంలో నడిచి తామెవరకీ తక్కువ కాదని నిరూపిస్తూ ఎదిగినప్పుడే బ్రెయిలీకి నిజమైన నివాళులు ర్పించినవారమవుతామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతులకు విద్య, ఉద్యోగ అవకాశాలు కల్పించి చేయూతనందిస్తోందన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని బాగా చదువుకునేందుకు అవసరమైన స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు వంటివి అందిస్తున్నట్లు తెలిపారు. 1995 దివ్యాంగుల చట్టాన్ని సవరిస్తూ 2016లో దివ్యాంగుల హక్కుల కొత్త చట్టానికి రూపకల్పన చేసి కొత్తగా మార్గదర్శకాలు, నిబంధనలు విడుదల చేసినట్లు వెల్లడించారు. ఈ చట్టం మేరకు జిల్లాస్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన విభిన్నపతిభావంతుల సంక్షేమం, అర్జీల పరిష్కారానికి ఒక కొత్త కమిటీ ఏర్పాటైందని.. ఈ కమిటీ ద్వారా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి కృషిచేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా ప్రతి కార్యాలయంలో విభిన్న ప్రతిభావంతుల గ్రీవెన్స్ రిడ్రెసల్ కోసం అధికారిని నియమించినట్లు కలెక్టర్ డిల్లీరావు వివరించారు.కార్యక్రమం సందర్భంగా సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్)లో భాగంగా విభిన్న ప్రతిభావంతులకు ఓటు ప్రాధాన్యం, ఓటు నమోదు, వివిధ ఫారాలు తదితరాలపై అధికారులు అవగాహన కలిగించారు. 40 శాతం, అంతకంటే అధిక వైకల్యం ఉన్నవారికి భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) హోం ఓటింగ్ సౌకర్యాన్ని కల్పిస్తోందని.. ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ డిల్లీరావు సూచించారు. తమ గ్రామ, వార్డు సచివాలయ పరిధిలోని బీఎల్‌వోను సంప్రదించి ఫారం-8 ద్వారా పీడబ్ల్యూడీ మార్కింగ్ చేయించుకోవాలని కలెక్టర్ డిల్లీరావు సూచించారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, టీజీ, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ వి.కామరాజు, ఎన్‌ఎఫ్‌బీ ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రెసిడెంట్ హసీమ్, విజువల్లీ ఛాలెంజ్డ్ ఎంఎ÷-లాయీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దుర్గారావు, న్యూ లైఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రటరీ చంద్రశేఖర్ రెడ్డి, యువజన సంక్షేమ అధికారి శ్రీనివాస్, సహాయ సాంఘిక సంక్షేమ అధికారి డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.÷ార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహకార సంస్థ ఛైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎం.ఏ.కుమార్ రాజా.. నూతన సంవత్సర కేలండర్‌ను, డైరీని ఆవిష్కరించారు.

# అధికారం కోల్పోవడంతో ఉక్కిరిబిక్కిరి



హైదరాబాద్, జనవరి 4 (సమ సమాజం): అధికారం కోల్పోవడంతో జీర్ణించుకోలేని బిఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ ప్రభుత్వంపై నిందలు వేసే పనిలో పడ్డారని మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్కలు మండిపడ్డారు. ప్రజల తీర్పును గౌరవించలేని సంస్కారం వారిదని ఎద్దేవా చేశారు. హైదరాబాద్ గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శ్రీధర్ బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ 420 అంటూ విడుదల చేసిన బుక్‌ట్‌పై శ్రీధర్ బాబు మండిపడ్డారు. గతంలో ఇచ్చిన అనేక హామీలను అమలు చేయలేని బిఆర్ఎస్ నేతలే డబుల్ 420ల ని ఎదురుదాడి చేశారు. దళితముఖ్యమంత్రి, దళితులకు 3 ఎకరాల భూమి, డబ్లు ఇళ్లు వంటివన్నీ వారి వైఫల్యాలకు నిదర్శనమని అన్నారు. తాము అధికారంలోకి రాగానే మహిళలరు ఉచితబస్సు సౌకర్యం కల్పించామని, ఆరోగ్యశ్రీ పథకంలో పదిలక్షలకు పెంచామని అన్నారు. కాంగ్రెస్ పాలన పట్ల ప్రజలు సంతోషంగా ఉన్నారని మంత్రి శ్రీదర్ బాబు అన్నారు. ప్రభుత్వం ఏర్పడ్డ 48 గంటల్లోనే రెండు వాగ్దానాలు అమలు చేశామని చెప్పారు. ప్రజా రవాణా మెరుగుపరిచామని తెలిపారు ఇప్పటి వరకు 6.5 కోట్ల జీరో టికెట్స్ ఇచ్చామని చెప్పారు. రాజీవ్ ఆరోగ్య శ్రీని రూ. 10 లక్షలకు పెంచామని తెలిపారు. కాంగ్రెస్ పై బీఆర్ఎస్ నేతల ఆరోపణలు సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వచ్చి 30 రోజులు కాలేదని అప్పుడే తమపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటని అన్నారు. తమ మ్యానిఫెస్టో పై విషపూరితమైన ప్రచారం చేస్తున్నారని అన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు పూరించే పనిలో ఉన్నామని తెలిపారు. నియంతృత్వ ధోరణిలో బీఆర్ఎస్ నేతలుఉన్నారని అన్నారు. ఓటమి తర్వాత కూడా బీఆర్ఎస్ నేతల్లో మార్పు రాలేదని అన్నారు. ప్రజలపై ప్రేమ ఉంటే విలువైన సలహాలు ఇవ్వండని సూచించారు. బీఆర్ఎస్ రిలీజ్ చేసిన బుక్ ను ఖండిస్తున్నామని శ్రీధర్ బాబు అన్నారు. రాష్ట్రాన్ని 3 వేల 500 రోజులు బీఆర్ఎస్ పార్టీ పాలించిందని, ఆరున్నర లక్షలకోట్ల అప్పులు పెట్టిందన్నారు. కాళేశ్వరంపై విచారణకు ఆదేశించామని అన్నారు.దళిత ముఖ్యమంత్రి, ఉచిత నిర్భంద విద్య, డబుల్ బెడ్ రూం, కేజీ టూ పీజీ, విభజన చట్టం హామీలు ఇలా చెప్పుకుంటు పోతే ఎన్నో అవన్ని ఎందుకు నెరవేర్చలేదని ప్రశ్నించారు. తెలంగాణను రూ. 6 నుంచి 7 లక్షల కోట్ల అప్పుల్లో ముంచారని శ్రీధర్ బాబు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పార్టీ అడ్రస్ గల్లంతవుతుందని ఆ విషయం వారికి కూడా తెలుసని అన్నారు. బీఆర్ఎస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో పోటి చేసేందుకు అభ్యర్థులు లేరని ఎద్దేవా చేశారు. ఇది గమనించి భయం పట్టుకుందని, గందరగోళంలో పడి ఏదేదో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ను ప్రజలు చెత్తబుట్టలో వేశారని శ్రీధర్ బాబు అన్నారు. బీఆర్ఎస్ తన పరువు తానే తీసుకుందని ప్రజలిచ్చిన ప్రతిపక్ష పాత్రకు బీఆర్ఎస్ పార్టీ న్యాయం చేకూర్చడం లేదని వెంటనే ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నేతలు కొంత మంది ఆటో సోదరులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. అన్ని ఆలోచనలు చేసే తమ మ్యానిఫేస్టోను రూపొందించామని శ్రీధర్ బాబు అన్నారు. మహిళలకు ఉచితబస్సును జీరి÷-ణించుకోవడం లేదని..వారు దీనిని వద్దంటున్నారా చెప్పాలన్నారు. 'మాది గడిల పాలన కాదు.. గల్లీ బిడ్డల పాలన. మా ప్రభుత్వానికి ప్రజల మద్దతు చూసి బీఆర్ఎస్ నేతలు భయపడి మాపై దుష్ప్రచారం చేస్తున్నారని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పార్టీ ఫ్యూడల్ పార్టీ అని.. అధికారం లేకుండా బీఆర్ఎస్ నాయకులు బతకలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఏకకాలంలో రుణమాఫీ అన్నారని ఏమైందని ప్రశ్నించారు. పదేళ్లు రాష్ట్రాన్ని దోపిడీ దొంగలు దోచుకున్నారని, బీఆర్ఎస్ పార్టీ 420 అనే ప్రజలు ఓడగొట్టారన్నారు. ప్రజాస్వామికంగా తాము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే కూల్చేస్తాం, పేలుస్తాం అంటున్నారని మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆటో వాళ్లని బీఆర్ఎస్ నేతలు రెచ్చగొట్టి వాళ్లతో నిరసనలు చేస్తున్నారని మండిపడ్డారు. ఉచిత బస్సు ఆలోచన రాగానే ఆటో డ్రైవర్లతో మొదటగా మాట్లాడిన తర్వాతనే మేనిఫెస్టోలో పెట్టినట్లు చెప్పారు. బీఆర్ఎస్‌నే 420 పార్టీ అని.. ఆ పార్టీ దొచుకున్న దంతా బయటకి వస్తోందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బడ్జెట్ బారెడు. ఖర్చు చారెడు అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ స్వేదపత్రం ఎక్కడిదని.. ఎవడు కష్టపడ్డారని నిలదీశారు. తెలంగాణ రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ కాదు. భ్రమల తెలంగాణ చేశారన్నారు. బంగారు తెలంగాణ పేరు చెప్పి అప్పుల తెలంగాణగా మార్చారని మండిపడ్డారు. రాష్ట్రాన్ని దోచుకుంది బీఆర్ఎస్ నాయకులు. భారం మోయాల్సింది తెలంగాణ ప్రజలా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులు అప్పు చేస్తే తెలంగాణ ఎందుకు సిగ్గు పడాలని మంత్రి సీతక్క నిలదీశారు.

# బిసిలను నాయకులుగా చేసిన ఘనత ఎన్టీఆర్‌దే

ఆ సంప్రదాయాన్ని టిడిపి కొనసాగిస్తోంది

ఎందరో నేతలను నాయకులగా తీర్చిదిద్దాం

వచ్చే ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా పనిచేయాలి

జయమో బిసి సదస్సులో చంద్రబాబు పిలుపు




అమరావతి,జనవరి 4 (సమ సమాజం): తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి లక్షల మంది బీసీలను నాయకులుగా తీర్చిదిద్దిన ఘనత టిడిపిదేనని, ఎన్టీఆర్ వచ్చిన తరవాతనే బిసిలకు ప్రాధాన్యం మొదలయ్యిందని, దానిని తాను కొనసాగించానని ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. వచ్చే ఎన్నికల్లో బిసిలంతా కలసికట్టుగా తెలుగుదేశం అధికారంలోకి వచ్చేలా కృషి చేయాలన్నారు. రాజకీయంగా వారికి ప్రాధాన్యం ఇస్తామని అన్నారు. ఇప్పుడు మనం మేల్కోక పోతే మళం÷-లీ మోసపోతామని హెచ్చరించారు. అవకాశం ఇచ్చినప్పుడే తన ప్రతిభ చూపిస్తారని, అవకాశం రాకపోతే ఎవరూ నాయకుడిగా మారలేరన్నారు. ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన 'జయహో బీసీ' సదస్సులో ఆయన మాట్లాడారు. జయహో బీసీ కోసం 40 రోజుల ప్రణాళిక రూపొందించామని, పేదల ఆర్థికంగా చితికిపోయే పరిస్థితి వచ్చిందని చంద్రబాబు అన్నారు. జయహో బీసీ లక్ష్యాలను లోక్‌సభ, అసెంబ్లీ స్థానాల్లో క్షేత్ర స్థాయికి తీసుకెళ్లేలా టీడీపీ ప్రణాళిక ఉంటుందని చంద్రబాబు తెలిపారు. గతంలో బీసీలకు టీడీపీ ఎంతో మేలు చేసిందన్నారు. లక్షలాది మందిని నాయకులుగా తీర్చిదిద్దిన చరిత్ర తెలుగుదేశం పార్టీది అన్నారు. వైసీపీ ప్రభుత్వం రాగానే 34 శాతం స్థానిక సంస్థల రిజర్వేషన్లను 24 శాతానికి కుదించారని ఆరోపించారు. వెనుకబడిన వర్గాలను ముందుకు తెచ్చింది ఎన్టీఆర్ అని పేర్కొన్నారు. 90 శాతం సబ్సిడీతో ఆధునిక పనిముట్లు అందించామన్నారు. నాలుగేళ్లలో బీసీలకు ఒక్క రూపాయి అయినా జగన్ ఇచ్చారా అని ప్రశ్నించారు. కార్పొరేషన్లు పెట్టి నిధులు ఇవ్వకపోతే ఏంలాభం అని చంద్రబాబు నిలదీశారు. వందల కోట్లు విలువచేసే పరికరాలను గోదాముల్లో ఉంచింది వైసీపీ ప్రభుత్వం అని విమర్శించారు. స్థానిక సంస్థల్లో ఎన్టీఆర్ 20 శాతం రిజర్వేషన్లు తెచ్చారని, బీసీలకు న్యాయం చేసిన పార్టీ టీడీపీ అని అన్నారు చంద్రబాబు.నాయకత్వ లక్షణాలు పెంచుకో వాలంటే అవకాశం రావాలి.. అలా రాకపోతే ఎవరూ నాయకుడిగా మారలేరని చంద్రబాబు అన్నారు. వెనుకబడిన వర్గాలను ఆర్థికంగా పైకి తీసుకొచ్చేందుకు కృషి చేశానన్నారు. ఆదాయం పెంచే మార్గాలను సూచించానని బాబు గుర్తు చేశారు.టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆదరణ కార్యక్రమంతో బీసీలను ఆదుకున్నామని చంద్రబాబు అన్నారు. 90 శాతం సబ్సిడీతో లబ్దిదారులకు పరికరాలు అందజేశామని తెలిపారు. 125 కులాలకు ఆర్థికసాయం చేసిన పార్టీ టీడీపీ అన్నారు. కార్పొరేషన్ల ద్వారా రూ.3,500 కోట్లు ఖర్చు చేశామన్నారు. రూ.75 వేల కోట్లు ఖర్చు చేస్తామని చెప్పిన జగన్ నాలుగేళ్లలో బీసీలకు ఒక్క రూపాయి అయినా జగన్ ఇచ్చారా? అని బాబు ప్రశ్నించారు. కార్పొరేషన్లు పెట్టి నిధులు లేకపోతే లాభమేంటి? ఆయన ప్రశ్నించారు. రూ.వందల కోట్ల విలువ చేసే పరికరాలను వైసీపీ ప్రభుత్వం గోదాముల్లో ఉంచేసిందన్నారు. వాటిని తుప్పు పట్టేలా మార్చారు తప్ప పేదలకు ఇవ్వలేదని బాబు విమర్శించారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను రద్దు చేశారన్నారు. కనీసం బీసీ భవనాలను కూడా పూర్తిచేయలేకపోయారన్నారు. మూడు రాజధానులు కాదు.. రాష్ట్రానికి అమరావతి ఒకటే రాజధాని.. దాన్ని పూర్తి చేసి తీరుతామని బాబు అన్నారు. బీసీలకు ఏం చేశారని వైసీపీ నేతలు సాధికార యాత్ర చేపడుతున్నారని చంద్రబాబు నిలదీశారు. ప్రతి ఒక్కరి ఆదాయం పెరిగితేనే నిజమైన అభివృద్ధి అని చంద్రబాబు చెప్పారు. టీడీపీ హయాంలో బీసీలకు జరిగిన మంచి.. వైసీపీ పాలనలో బీసీలు ఏం కోల్పోయారన్న విషయాలను సదస్సు ద్వారా టీడీపీ తెలియజేస్తోందని తెలిపారు. గతంలో బీసీ చెంతకు వచ్చే ధైర్యం చేయకూడదనే బీసీ రక్షణ చట్టం పెట్టామని తెలిపారు. టీడీపీ పాలనలో బీసీలకు ఎంత మేలు జరిగిందో, వైసీపీ పాలనలో బీసీలు ఏం కోల్పోయారో జయహో బీసీ సదస్సు ద్వారా తెలియజేస్తున్నామని చెప్పారు. చెత్తపై కూడా సీఎం జగన్ పన్ను వేశారని విమర్శించారు. కరెంట్ ఛార్జీలు విచ్చలవిడిగా పెంచారని మండిపడ్డారు. బీసీల గురించి ప్రత్యేకంగా రూపొందించిన పాటను టీడీపీ అధినేత చంద్రబాబు విడుదల చేశారు. ఏపీలో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీ బీసీల ఓట్లపై ఫోకస్ పెట్టింది. ఈ నేపథ్యంలోనే 'కదలిరా బీసీ సోదరా.. నీకు పసుపు జెండా అండ ఉందిరా' అంటూ ప్రత్యేక గీతాన్ని రూపొందించింది. చెమట చుక్కతోనే చరిత్రలెన్నో సృష్టించే బీసీలమంటూ సాగిన.. ఈ ప్రత్యేక గీతాన్ని సినీ గేయ రచయిత కరీముల్లా పాడారు. కాగా, పాట విడుదల సందర్భంగా పాటను రూపొందించిన కరీముల్లాను చంద్రబాబు అభినందించారు.

Edited, Printed, Published & owned by *GOSUKONDA PRUDHVIRAJU*, Published From, Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, TELANGANA, Printed at *Panidhar PUBLICATIONS.* Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, ***Editor: GOSUKONDA PRUDHVIRAJU***,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in